సాక్షి
కుమురం భీం

గురువారం ׀ 11 ׀ సెప్టెంబర్ ׀ 2025



ఆధార్ లేదు.. పథకాలు అందవు

ప్రభుత్వం అన్నింటికీ ఆధార్‌కార్డు తప్పనిసరి చేస్తోంది. కానీ కెరమెరి మండలంలోని అనేక మంది విద్యార్థులకు ఆధార్‌కార్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸



ఓటరు జాబితా విడుదల

జిల్లాలోని పలు మండలాల్లో అధికారులు ప్రాదేశిక ఓటరు జాబితాను విడుదల చేశారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో తుది జాబితాను ప్రదర్శించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.5 /25.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



ట్రాక్టర్ వద్ద ఏడీ గంగాధర్, ఎంవీఐ మోహన్

సాక్షి ఎఫెక్ట్..

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలపై 'సాక్షి'లో ఈ నెల 8న ప్రచురితమైన 'రెచ్చిపోతున్న ఇసుకాసురులు' అనే కథనానికి అధికారులు స్పందించారు. రెబ్బెన మండలం పులికుంట వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను బుధవారం మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. మైనింగ్ ఏడీ గంగాధర్, ఎంవీఐ మోహన్ సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహించి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లతో పాటు సరైన ధ్రువపత్రాలు లేని రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. వాటిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తోందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చిన్నారులకు టీకా తప్పనిసరి

- డీఎంహెచ్‌వో సీతారాం



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

కెరమెరి(ఆసిఫాబాద్): రెండేళ్లలోపు చిన్నారులకు టీకా తప్పనిసరిగా వేయించాలని జిల్లా వైద్యాధికారి సీతారాం అన్నారు. మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలో బుధవారం ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా వ్యాధుల నివారణకు చిన్నారులకు టీకాలు వేయించాలని సూచించారు. రూ.5వేల విలువైన రక్త పరీక్షలు ప్రాథమిక కేంద్రాల్లో ఉచితంగా చేస్తారని, రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. నిల్వ నీటితో దోమలు వృద్ధి చెందుతాయని, మురుగునీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వేడిచేసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. బాలింతలు, గర్భిణులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో శ్యాంలాల్, సీహెచ్‌వో సంపత్, హెచ్‌ఈవో సోము, సూపర్‌వైజర్ సంపూర్ణ, ఏఎన్‌ఎం వందన, హెచ్‌ఏలు వసంత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ తరగతులతో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థులకు డిజిటల్ తరగతుల ద్వారా నాణ్యమైన విద్య అందించాలని విద్యాశాఖ ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని జెడ్పీఎస్‌ఎస్ పెట్రోల్ పంప్ పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధించాలన్నారు. పఠనంపై ఆసక్తి కలిగేలా పాఠ్యపుస్తకాలు, గ్రంథాలయాల్లోని పుస్తకాలను అరగంట పాటు గట్టిగా చదవడం అలవాటు చేయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రణాళిక ప్రకారం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. అంతకుముందు పాఠశాల ఆవరణలోని మంచినీటి సదుపాయం, వంటగదులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో వాసాల ప్రభాకర్, పెంచికల్‌పేట్ ఎంఈవో తోట రమేశ్‌బాబు, ప్రధానోపాధ్యాయుడు వెంకట రాజయ్య, ప్రమీలదేవి, పర్వ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్.. ఫెయిల్..!



ఈ నెల 8న రాత్రి జిల్లా కేంద్రంలోని వాసవీమందిర్ సమీపంలో గల ఓ వ్యాపారి ఇంట్లో ఏసీ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సుమారు అరగంట తర్వాత ఫైరింజన్ సంఘటనా స్థలికి చేరుకుంది. అప్పటికే ఇంట్లో మంటలు ఫర్నిచర్, సీలింగ్‌కు వ్యాపించడంతో క్షణాల్లో సామగ్రి కాలిపోయింది. సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. జిల్లా కేంద్రంలోనే అగ్నిమాపక శాఖ సేవలు ఇలా ఉంటే.. ఇక మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి ఏంటని జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- గాడితప్పిన ఫైర్‌స్టేషన్ల నిర్వహణ
- శిథిలావస్థలో భవనాలు.. సిబ్బంది కొరతతో ఇబ్బందులు
- ఫైరింజన్లు వెళ్లేసరికే కాలిబూడిదవుతున్న ఆస్తులు
- జిల్లాలో ఐదేళ్లలో 164 అగ్ని ప్రమాదాలు
- రూ.2.10 కోట్ల ఆస్తి నష్టం



జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రం

ఐదేళ్లలో జరిగిన అగ్ని ప్రమాదాలు, నష్టం

సంవత్సరం	ప్రమాదాలు	ఆస్తి నష్టం (రూ.లలో)
2020- 21	52	25,77,300
2021- 22	30	38,71,000
2022- 23	39	41,75,500
2023- 24	18	35,00,000
2024- 25	25	69,05,000

ఆసిఫాబాద్: అగ్ని ప్రమాదాల్లో రూ.లక్షల విలువైన ఆస్తులు బుగ్గిపాలవుతున్నాయి. మున్సిపాలిటీల్లో అంతంత మాత్రంగానే సేవలందుతుండగా, మారుమూల గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఫైరింజన్ సకాలంలో చేరుకోకపోవడంతో ఆస్తులు కాలిబూడిదవుతున్నాయి. శిథిలావస్థకు చేరిన భవనాలు, సరిపడా సిబ్బంది లేకపోవడంతో సేవలందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో 15 మండలాలకు ఒకే అగ్నిమాపక కేంద్రం ఉండగా, కాగజ్‌నగర్‌లో మరొకటి ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రం పరిధిలో 7 నుంచి 8 మండలాలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రం పరిధిలో ఆసిఫాబాద్, రెబ్బెన, వాంకిడి, కెరమెరి, తిర్యాణితోపాటు ఏజెన్సీ మండలాలు ఉండగా, కాగజ్‌నగర్ కేంద్రం ద్వారా కాగజ్‌నగర్, బెజ్జూర్, కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, దహెగాం, సిర్పూర్(టి) మండలాలకు సేవలందిస్తున్నారు. జిల్లాలో ప్రధాన పంట పత్తి కావడంతో వివిధ ప్రాంతాల్లో సుమారు 30 వరకు జిన్నింగ్ మిల్లులు, రైస్ మిల్లులు, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. గత ఐదేళ్లలో జిల్లాలో 164 అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోగా.. రూ.2,10,28,800 ఆస్తి నష్టం వాటిల్లింది. ఒకరు మృతి చెందారు.

శిథిలావస్థలో భవనాలు

జిల్లా కేంద్రంలో 1984లో అగ్నిమాపక కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రారంభంలో వివేకానంద చౌక్ సమీపంలోని పాత గ్రామ పంచాయతీలో కార్యాలయం కొనసాగగా, అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట స్థలం కేటాయించి కొత్త కార్యాలయం నిర్మించారు. దశాబ్దాలు గడుస్తుండటంతో ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. స్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. మరోవైపు కాగజ్‌నగర్ పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయానికి సొంత భవనం లేదు. ఈజ్‌గాం రహదారిపై పాత నవోదయ భవనంలో కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనం సైతం శిథిలావస్థకు చేరుకుంది. జిల్లా కేంద్రం ఏర్పాటు అనంతరం కొత్తగా ఆస్పత్రులు, పాఠశాలలు, ఫంక్షన్ హాళ్లు, పరిశ్రమలతోపాటు అనేక ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. కానీ నిర్మాణ సమయంలో యజమానులు సేఫ్టీ నిబంధనలు పాటించడం లేదు. ఏటా ఏప్రిల్ 14 నుంచి 20 వరకు సంబంధిత శాఖ అధికారులు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి.. ఆ తర్వాత పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

సర్వం కోల్పోతున్నాం



లింగాపూర్ మండలంలో ఎక్కడైనా అగ్నిప్రమాదం జరిగితే 50 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న ఆసిఫాబాద్ లేదా ఉట్నూర్, ఆదిలాబాద్ నుంచి ఫైరింజన్ రావాలి. అగ్నిప్రమాదాల్లో సర్వం కోల్పోతున్నాం. గతేడాది మామిడిపల్లిలో షార్ట్ సర్క్యూట్‌తో రైతు తెలంగ్‌రావు ఇల్లు పూర్తిగా కాలిపోయింది. పత్తితీత పనులు ప్రారంభమైతే ఇంట్లోనే నిల్వ చేసుకుంటారు. ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంది.

– జాటోత్ రాహుల్, లింగాపూర్

సిబ్బంది కొరత ఉంది

జిల్లా కేంద్రంలోని ఫైర్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉంది. భవనం శిథిలావస్థకు చేరింది. జిల్లాలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటే వెంటనే 87126 99190, 87126 99191 నంబర్లకు సమాచారం ఇవ్వాలి. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి వెళ్తున్నాం.

– కార్తీక్, ఫైర్ అధికారి, ఆసిఫాబాద్

వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లా కేంద్రంలోని అగ్ని మాపక కేంద్రంలో 16 మంది సిబ్బందికి ప్రస్తుతం 10 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. మరో ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో ఐదు ఫైర్‌మెన్లు, ఒక ఫైర్ ఫిట్టర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. జిల్లా కేంద్రంలో రెండు అగ్నిమాపక వాహనాలతో పాటు ఒక రెస్క్యూ వాహనం ఉంది. కాగజ్‌నగర్‌లో ఒక అగ్నిమాపక వాహనం, బుల్లెట్ బైక్ ఉంది. ఇరుకు వీధుల్లో ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు బుల్లెట్ బైక్‌పై వెళ్లి మంటలార్పుతున్నారు. తగినంత సిబ్బంది లేకపోవడంతో ఉన్న వారిపై అదనపు భారం పడుతోంది. శీతాకాలం, వేసవిలో మరిన్ని అగ్ని ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే 'పాల్వాయి'



రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహతో సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని డయాలసిస్ కేంద్రాన్ని విస్తరించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు బుధవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ కార్యాలయంలో కలిశారు. సిర్పూర్ నియోజకవర్గానికి చెందిన 90 మంది కిడ్నీ రోగులకు డయాలసిస్ అవసరం ఉందని తెలిపారు. ప్రస్తుతం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గల డయాలసిస్ కేంద్రంలో ఐదు పడకలు మాత్రమే ఉన్నాయని, దీనిని 10 పడకలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. అలాగే కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరో డయాలసిస్ కేంద్రం మంజూరు చేయాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శికి విస్తరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట సిర్పూర్ మాజీ జెడ్పీటీసీ నీరటి సత్యనారాయణ ఉన్నారు.

కూరగాయల సాగుతో లాభాలు



వంకాయ తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త స్రవంతి

కెరమెరి(ఆసిఫాబాద్): రైతులు తమకున్న సాగు భూమిలో కొంతస్థలంలో కూరగాయలు సాగుచేసి లాభాలు సాధించవచ్చని బెల్లంపల్లి ఉద్యానవన కేంద్రం శాస్త్రవేత్త స్రవంతి అన్నారు. మండలంలోని పెద్దసాకడ గ్రామంలో బుధవారం చిక్కుడు సాగులో సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పత్తి పంట సాగు, అధిక వర్షాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఆత్రం బల్లార్ షా సాగు చేస్తున్న వంకాయ తోటను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, రైతులు కేంద్రె బాలాజీ, కుమురం న్యానేశ్వర్, ఆడ రాంచందర్ తదితరులు ఉన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో అభివృద్ధికి కృషి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తిగా జిల్లా అభివృద్ధికి సమన్వయంతో కృషి చేద్దామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి నిర్వహించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఇతర జిల్లా అధికారులతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలితరం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ భూమి, భుక్తి, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం పోరాడారని గుర్తు చేశారు. జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ హాల్, ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ జిల్లా అధికారి సజీవన్, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కడతల మల్లయ్య, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

ఆసిఫాబాద్‌రూరల్: మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండలంలోని అడ గ్రామంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ సౌజన్యంతో మత్స్యకారులకు వలలు, టార్చ్ లైట్లు, బోట్లు, పెట్టేలు, ఇతర పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు, విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ సీఈవో రాజేంద్రబాబు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

పాఠశాలలకు ప్రొజెక్టర్లు అందజేత

జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ వారి సౌజన్యంతో పది పాఠశాలలకు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ప్రొజెక్టర్లు పంపిణీ చేశారు. గత సంవత్సరం భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెట్ సంస్థ సైన్స్ ల్యాబ్ వాహనం అందించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి, భారత్ ఎలక్ట్రానిక్ లిమిటెడ్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా ఉత్తమ టీచర్లుగా ఎంపికైన 55 మంది ఉపాధ్యాయులను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే బుధవారం అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి సన్మానించారు. ముందుగా మాజీ ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందించి శాలువాలతో సన్మానించారు. జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సజీవన్, డీటీడీవో రమాదేవి, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, ఎస్‌వోలు శ్రీనివాస్, మధుకర్, పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, ఎంఈవో సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

'అడ'కు తాత్కాలిక మరమ్మతులు

- రూ.43 లక్షలు మంజూరు
- వర్షాకాలం తర్వాత పనులు ప్రారంభం
- శాశ్వత మరమ్మతులు చేపట్టాలని రైతుల వేడుకోలు



అడ ప్రాజెక్టు ఆనకట్టపై కప్పిన కవర్లు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ప్రధానమైన కుమురం భీం(అడ) ప్రాజెక్టు ఆనకట్టకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.43 లక్షలు మంజూరు చేసింది. ప్రమాదకరంగా ఉన్న 200 మీటర్ల మేర కట్టపై పనులు చేపడతామని ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు.

బీటలువారి.. ప్రమాదకరంగా మారి

రూ.882 కోట్ల అంచనాలతో ఆసిఫాబాద్ మండలంలో కుమురంభీం ప్రాజెక్టును నిర్మించారు. 10 టీఎంసీల నీటి సామర్థ్యంతో 45,500 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించాలని ప్రణాళికలు రూపొందించారు. అయితే ప్రాజెక్టు 2011లో పూర్తికాగా, కొన్నేళ్లకే ఆనకట్టపై పగుళ్లు ఏర్పడ్డాయి. మట్టి కొట్టుకుపోకుండా నాలుగు సంవత్సరాల నుంచి ఆనకట్టపై కవర్లు కప్పి ఉంచుతున్నారు. ఆనకట్ట ఎత్తు 45 మీటర్లు కాగా, ప్రస్తుతం పైభాగం నుంచి రెండు, మూడు మీటర్ల లోతు వరకు పగుళ్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాత్కాలిక మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.43 లక్షల నిధులు కేటాయించింది. బీటలువారిన 200 మీటర్ల పొడవు మేర ఆనకట్టపై మూడు మీటర్ల లోతు వరకు మట్టిని తొలగించి మళ్లీ గ్రావెల్‌తో నింపుతామని అధికారులు తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టగానే పనులు ప్రారంభించే అవకాశం ఉంది.

మరిన్ని నిధులు కావాల్సిందే..

అడ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 10.393 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.688 టీఎంసీలు మాత్రం నిల్వ ఉంచుతున్నారు. డెడ్ స్టోరేజీ 1.423 టీఎంసీలు. మిగిలిన నీటినే సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకుంటున్నారు. బుధవారం ఇన్‌ఫ్లో 683 క్యూసెక్కులు ఉండగా ఒక గేటును 0.3 మీటర్లు పైకెత్తి 629 క్యూసెక్కులు కిందికి వదులుతున్నారు. 38 క్యూసెక్కుల నీటిని మిషన్ భగీరథ నీటి అవసరాలకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు పూర్తిస్థాయి మరమ్మతులకు రూ.19 కోట్లు అవసరమని మూడేళ్ల క్రితం జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ నేటి వరకు నిధులు మాత్రం రాలేదు. ప్రస్తుతం వ చ్చిన నిధులతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టనుండగా, కాలువల పరిస్థితి మెరుగుపడే అవకాశం లేదు. మరిన్ని నిధులు ఇస్తేనే ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందుతుందని రైతులు చెబుతున్నారు.

మిగిలిన ప్రాజెక్టులూ అంతే..

జిల్లాలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంతో పంట పొలాలు బీళ్లుగానే ఉంటున్నాయి. ప్రధానమైన ప్రాజెక్టులు వట్టివాగు, జగన్నాథ్‌పూర్ తదితర ప్రాజెక్టులు ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించడం లేదు. పుష్కలంగా నీరున్నా కాలువల ఆధునికీకరణ, మరమ్మతులు చేపట్టడం లేదు. ప్రధాన ప్రాజెక్టుల ద్వారా కేవలం 10 శాతం మాత్రమే సాగు నీరందుతుంది. జిల్లాలో చాలా మంది రైతులు ఆరుతడి పంటలకే పరిమితం అవుతున్నారు.

200 మీటర్ల మేర..

కుమురంభీం ప్రాజెక్టు ఆనకట్ట తాత్కాలిక మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.43లక్షలు మంజూరు చేసింది. దెబ్బతిన్న 200 మీటర్ల మేర ఆనకట్టపై పనులు చేపడతాం. వర్షాకాలం పూర్తయిన తర్వాత మరమ్మతులు ప్రారంభిస్తాం.

– గుణవంతరావు, ఇరిగేషన్ ఈఈ

కాగజ్‌నగర్ స్టేషన్ పరిశీలించిన డీఆర్‌ఎం

- వందేభారత్ హాల్టింగ్ వసతులపై ఆరా

కాగజ్‌నగర్‌టౌన్/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌ను బుధవారం సాయంత్రం సికింద్రాబాద్ డీఆర్‌ఎం ఆర్.గోపాలకృష్ణన్ పరిశీలించారు. వందేభారత్ రైలు హాల్టింగ్ కోసం స్టేషన్‌లోని సౌకర్యాలపై ఆరా తీశారు. ప్లాట్‌ఫాం నం.1లో ప్రయాణికుల కుర్చీల ఎత్తు పెంచాలని సూచించారు. అడ్డంగా ఉన్న కేబుళ్లను తొలగించాలని ఆదేశించారు. క్యాంటీన్ పక్క నుంచే వెళ్లే ఫ్లై ఓవర్ వంతెనకు పరదాలు ఏర్పాటు చేసి, దుమ్ము రాకుండా చూడాలన్నారు. అనంతరం డీఆర్‌ఎంను రైల్వే యాత్రి సేవా సమితి ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. రైల్వే యాత్రి సమితి అధ్యక్షుడు ప్రయాగ్ తివారి మాట్లాడుతూ వందేభారత్ రైలు హాల్టింగ్ ఇవ్వడం అభినందనీయమన్నారు. తమిళనాడు, కేరళ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు సైతం హాల్టింగ్ ఇవ్వాలని డీఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వసతులు పరిశీలిస్తున్న డీఆర్‌ఎం గోపాలకృష్ణన్

కాగజ్‌నగర్ రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న రైల్వే ఉద్యోగుల మహిళలు డీఆర్‌ఎంకు సమస్యలు విన్నవించారు. క్వార్టర్లు శిథిలావస్థకు చేరాయని, వర్షాలకు వరద వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిచ్చిమొక్కలు పెరిగినా పట్టించుకోవడం లేదన్నారు. రాత్రిపూట పోలీసు సెక్యూరిటీ కల్పించాలని కోరారు. విడతలవారీగా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆర్‌డీఎం హామీ ఇచ్చారు. సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ నవీన్‌కుమార్, డీవోఎం సురేశ్, డీసీఎం సఫాలీ, పీఆర్వో పవన్ బల్‌దేవ్, ఆర్పీఎఫ్ ఎస్సై ప్రాచీదేవి, ఏఎస్సై ఆర్.దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతితో మరింత బాధ్యత



స్వప్నకు పదోన్నతి చిహ్నం అందిస్తున్న డీఎఫ్‌వో

ఆసిఫాబాద్‌అర్బన్: పదోన్నతితో ఉద్యోగులపై మరింత బాధ్యత పెరుగుతుందని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ అన్నారు. జోడేఘాట్ రేంజ్ ఎఫ్‌బీవోగా విధులు నిర్వర్తించి ఎఫ్‌ఎస్‌వోగా పదోన్నతి పొందిన స్వప్నకు జిల్లా కేంద్రంలో బుధవారం పదోన్నతి చిహ్నం అందించారు. ఆయన మాట్లాడుతూ ఇతర జిల్లాల నుంచి ఒక డీఆర్‌వో, ముగ్గురు సెక్షన్ ఆఫీసర్లు జిల్లాకు వచ్చారని తెలిపారు. అలాగే జిల్లాలో ఒక సెక్షన్ అధికారికి పదోన్నతి లభించిందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జూనియర్ ఫారెస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యోగేశ్ కులకర్ణి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా ఉత్పత్తి సాధించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి చేపట్టాలని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్సు) కె.వెంకటేశ్వర్లు అన్నారు. ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి బుధవారం ఖైరిగూర ఓసీపీని సందర్శించారు. ఓసీపీ వద్ద పనిస్థలాలు తనిఖీ చేశారు. అనంతరం ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఖైరిగూర ఓసీపీ వెళ్లే మార్గమధ్యలోని పావురాల గుట్ట వద్ద దెబ్బతిన్న రోడ్డును పరిశీలించారు. త్వరగా మరమ్మతులు చేపట్టాలని సూచించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించారు. నూతనంగా చేపట్టే గోలేటి ఓసీపీ పనుల పురోగతిని సమీక్షించారు. ఆయా కార్యక్రమాల్లో పీవో మచ్చగిరి నరేందర్, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజినీరు కృష్ణమూర్తి, గోలేటి ఓసీపీ పీవో ఉమాకాంత్, డీజీఎం సివిల్ ఎస్‌కే మదీనాబాషా, మేనేజర్ శంకర్, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



పని స్థలాలు పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

క్లుప్తంగా

పిడుగుపడి గేదె మృతి

దండేపల్లి: మండలంలోని నాగసముద్రం గ్రామంలో బుధవారం పిడుగుపాటుతో గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన అనవేని శంకరయ్య తన గేదెను ఇంటిముందు చెట్టుకింద కట్టేసి ఉంచాడు. మధ్యాహ్నం వర్షం పడే సమయంలో ఒక్కసారిగా గేదెపై పిడుగు పడటంతో అది అక్కడికక్కడే మృత్యువాత పడింది. గేదె విలువ రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. పరిహారం ఇప్పించాలని వేడుకున్నాడు.

మిస్సింగ్ కేసు నమోదు


లక్ష్మణ్ (ఫైల్)

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామానికి చెందిన పన్నెవాడ్ లక్ష్మణ్ (56) ఆచూకీ లభించకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జుబేర్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణ్ గత నెల 31న తన కుమారుడు గణేశ్‌తో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. అదేరోజు సాయంత్రం హైదరాబాద్‌లో నిర్వహించే గణేశ్ నిమజ్జనోత్సవాలు చూసి వస్తానని కుమారుడికి చెప్పి వెళ్లిపోయాడు. 10 రోజులైనా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. మంగళవారం రాత్రి అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

దొరకని శృతి ఆచూకీ


గోదావరిలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

దండేపల్లి: మండలంలోని గూడెం గోదావరి నదిలో మంగళవారం దూకి గల్లంతైన తిర్యాణి మండలం తలండికి చెందిన వివాహిత పోలోజు శృతి ఆచూకీ లభించలేదని ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. బుధవారం చీకటి పడే వరకు గజ ఈతగాళ్లు నదిలో గాలించారని పేర్కొన్నారు. నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుండెల రమేశ్‌కు చెందిన ఏడు గొర్రెలు కుక్కల దాడిలో మృతి చెందాయి. వివరాలు.. బుధవారం రమేశ్ ఏడు గొర్రెలను ఇంటిలోని ఓ షెడ్డులో కట్టేసి మిగతా వాటిని మేతకు తీసుకువెళ్లాడు. అతడి భార్య కూలీ పనికి వెళ్లిపోయింది. ఈక్రమంలో ఇంటి పరిసరాలు ప్రశాంతంగా ఉన్న సమయంలో ఒక్కసారిగా కుక్కలు గొర్రెలపై దాడి చేసి తీవ్రంగా గాయపరచగా అవి మృతి చెందాయి. రమేశ్ దంపతులు ఇంటికి తిరిగి వచ్చి మృతి చెందిన గొర్రెలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

నానమ్మ, మనవరాలు అనుమానాస్పద మృతి


సత్యవతి, గీత శిరీష (ఫైల్)

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోపాలవాడ రైల్వే ఏ క్యాబిన్ సమీపంలో ఉన్న ఓ ఇంట్లో ఖమ్మం పట్టణానికి చెందిన బెజ్జాల సత్యవతి(55), ఆమె మనవరాలు గీతశిరీష (4) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఇదే ఇంట్లో మూడేళ్ల క్రితం సత్యవతి చిన్న కుమారుడు శిరీష (24) ట్రాన్స్‌జెండర్ సైతం అనుమానాస్పదంగా మృతిచెందడం అప్పట్లో కలకలం రేపింది. ప్రస్తుతం నానమ్మ, మనవరాలు మృతిచెందడం చర్చనీయాంశంగా మారింది. మంచిర్యాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కేంద్రంలోని 3టౌన్‌కు చెందిన బెజ్జాల చంద్రయ్య, సత్యవతి దంపతులకు ఇద్దరు కుమారులు గంగోత్రి, వెంకటేశ్ ఉండగా.. చిన్న కుమారుడు వెంకటేశ్ ట్రాన్స్‌జెండర్(శిరీష)గా మారి మంచిర్యాలలో స్థిరపడింది. గోపాలవాడ శివారులో రైల్వే ఏ క్యాబిన్ వద్ద ఓ ఇల్లు నిర్మించుకుని జీవనం సాగించింది. 2022 జనవరి 4న అనుమానాస్పదంగా మృతిచెందింది. అప్పటి నుంచి ట్రాన్స్‌జెండర్ శిరీష కుటుంబ సభ్యులు తరచూ వచ్చి వెళ్తుండేవారు. ఈ క్రమంలో ఈ నెల 8న గంగోత్రి తన తల్లి సత్యవతి, కూతురు గీతశిరీషతో కలిసి ట్రాన్స్‌జెండర్ శిరీష ఇల్లు విక్రయించడానికి మంచిర్యాలకు వచ్చారు. 9న తనకు అస్తమా సమస్య వచ్చిందంటూ గంగోత్రి తల్లి సత్యవతి, కూతురు గీతశిరీషను ఇక్కడే వదిలి ఖమ్మం వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం తన తల్లి ఫోన్ లిఫ్ట్ చేయడం లేదంటూ పక్కింటి వారికి సమాచారం అందించాడు. స్థానికులు వెళ్లి పరిశీలించగా తలుపులు తీయకపోవడంతో 'డయల్ 100'కు సమాచారం ఇచ్చారు. పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా సత్యవతి, గీతశిరీష విగత జీవులుగా కనిపించారు. ఈ విషయమై కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు పలుసార్లు గంగోత్రికి సమాచారం ఇచ్చి రావాలని సూచించినా రాకపోవడంతో అక్కడి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

హత్యా..? ఆత్మహత్యా..?

సత్యవతి, గీతశిరీష మృతి హత్యా..? ఆత్మహత్యా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటిని విక్రయించడానికి వచ్చిన ముగ్గురిలో ఇద్దరు ఇక్కడే ఉండడం, ఒక్కరే వెళ్లిపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఫుడ్ పాయిజన్ జరిగి ఉంటుందా? అనేది చర్చనీయాంశంగా మారింది. మృతదేహాలను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఏం జరిగిందనేది పోస్టుమార్టం నివేదికలో తేలనుంది.

ఒకరి అనుమానాస్పద మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామయ్య

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన మురిమడుగుల మల్లయ్య (58) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానిక ఎస్సై సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య కొద్దిరోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈనెల 9న సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చి కుర్చీలో కూర్చోగా నోటి నుంచి నురగలు వచ్చాయి. గమనించిన కుటుంబీకులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, తన తండ్రి మల్లయ్య మృతికి పాము కాటా.. లేదా అనారోగ్యమా? అనేది తెలియడం లేదని మృతుడి కుమారుడు అరుణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి


దరావత్ నందు (ఫైల్)

లక్ష్మణచాంద: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వడ్యాల్ తండా గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. వడ్యాల్ తండాకు చెందిన దరావత్ నందు (25) గత నెల 30న తన భార్యతో కలిసి నిర్మల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో నిర్మల్ రూరల్ మండలంలోని కొండాపూర్ జాతీయ రహదారిపై ఇతని ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని ముందు నిర్మల్ ఏరియా ఆస్పత్రికి, ఆ తరువాత హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఉదారి నారాయణకు కీర్తి పురస్కారం


ఉదారి నారాయణ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకు చెందిన కవి, రచయిత ఉదారి నారాయణ 2024 సంవత్సరానికి కీర్తి పురస్కారానికి ఎంపికైనట్లు తెలుగు యూనివర్సిటీ వీసీ సురవరం ప్రతాప్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ యాసలో తనదైన శైలిలో కవితలు రాస్తున్నందుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆడిటోరియంలో అవార్డు అందజేయనున్నట్లు తెలిపారు. అవార్డు కింద రూ.5,116 నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు వివరించారు. ఆయన ఎంపిక కావడంపై పలువురు కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

గుడుంబా పట్టివేత

భీమిని: మండలంలోని మల్లీడి గ్రామానికి చెందిన కోట ఇస్తారి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఐదు లీటర్ల గుడుంబాను శనివారం పట్టుకున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన గుడుంబా విలువ రూ.2వేలు ఉంటుందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు విద్య, వైద్యం అందించాలి


మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యం అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచించారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో ఉమ్మడి జిల్లాల ఉపసంచాలకులు, సహాయ గిరిజన సంక్షేమ అధికారులతో ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షణపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గిరిజన కోఆపరేటివ్ సొసైటీ ద్వారా ఆశ్రమ పాఠశాలలకు సరుకులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరిజన సహాయ సంక్షేమ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రిన్సిపల్ గది, స్కూల్ ఆవరణలోని సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాల గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు అంబాజీ, రమాదేవి, ఏటీడీవోలు, ఏసీఎంవోలు, అదనపు వైద్యశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పవర్ ప్లాంట్‌లో సింగరేణి డైరెక్టర్


ప్లాంట్ అధికారులతో తిరుమలరావు

జైపూర్: మండల కేంద్రంలోని ఎస్టీపీపీలో బుధవారం సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం) ఎం.తిరుమలరావు పర్యటించారు. ముందుగా ఆవరణలో మొక్క నాటారు. అడ్మిన్ కార్యాలయంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు, అధికారులు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. విద్యుదుత్పత్తి, పనితీరుపై అధికారులు వివరించారు. ఉత్పత్తిలో దేశస్థాయిలో ఇప్పటివరకు 50కిపైగా అవార్డులు అందుకోవడంపై హర్షం వ్యక్తంజేశారు. ఇదేస్ఫూర్తితో 800 మెగావాట్ల కొత్త ప్లాంట్ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.

శిక్షణ కేంద్రంలో ప్రవేశాలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఖేలో ఇండియా బాక్సింగ్ శిక్షణ కేంద్రంలో ప్రవేశాలు స్వీకరిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హనుమంతరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న 10–20 ఏళ్లలోపు బాలబాలికలు వివరాలకు కోచ్ రాజేశ్‌ను 9963539234 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఏటీఎంలో చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఏటీఎంలో చోరీకి యత్నించిన నిందితుడు బిప్లబ్‌కుమార్ జీనను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఒరిస్సా రాష్ట్రం బలేశ్వర్ జిల్లా జమల్‌పూర్‌కు చెందిన నిందితుడు ఈనెల 8న అర్ధరాత్రి జిల్లా కేంద్రంలోని పంజాబ్ చౌక్‌లోగల డీబీఎస్ ఏటీఎంలో చోరీకి యత్నించినట్లు తెలిపారు. గడ్డపారతో ఏటీఎంను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించగా అలారం మోగడంతో పారిపోయినట్లు పేర్కొన్నారు. దీంతో ఎస్పీ వన్‌టౌన్, టూటౌన్ సీఐలను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. 2011 నుంచి 2015 వరకు ఆదిలాబాద్ పట్టణంలోని పలు హోటళ్లలో నిందితుడు పనిచేసినట్లు తెలిపారు. దొంగతనానికి యత్నించిన సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని పట్టుకున్న వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్, టూటౌన్ సీఐ నాగరాజు, ఎస్సై, సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు పేర్కొన్నారు.

దాడి కేసులో ఇద్దరి రిమాండ్


నిందితుల అరెస్ట్ చూపిస్తున్న ఎస్సై ఆంజనేయులు

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లికి చెందిన గిన్నె సతీశ్‌పై దాడి చేసి గాయపరిచిన ఘటనలో బుధవారం ముద్రకోల్ల రాజా, ఆవుల రాజేందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జూలై 27న ముత్యంపల్లి మోడల్‌స్కూల్, పోచమ్మ గుడి సమీపంలో మోటార్ సైకిల్‌పై వేగంగా వెళ్తున్న వారిని సతీశ్ మందలించాడు. దీంతో బూతులు తిడుతూ దాడిచేసి బండరాళ్లపై తోయడంతో తీవ్రగాయాలైనట్లు తెలిపారు. బాధితుడి సోదరి లత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీ


బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసు సిబ్బంది

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ఇద్దరు మహిళల వద్ద నగదు చోరీకి గురైంది. మండలంలోని ఎర్వచింతల్‌కు చెందిన శివస్మితకు చెందిన రూ.5వేలతో పాటు జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలానికి చెందిన సాయమ్మకు చెందిన రూ.20వేలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. జగిత్యాల బస్సు ఎక్కే క్రమంలో జనం రద్దీ ఎక్కువగా ఉండడంతో దొంగలు ఇదే అదనుగా చేతివాటం ప్రదర్శించారు. దీంతో బాధితులు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా ఎస్సై రాహుల్ గైక్వాడ్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకుని తనిఖీ చేశారు.

ఇద్దరికి ఆరునెలల జైలు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ ఆదేశాల మేరకు మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన పాత కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులను జైలుకు తరలించినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. బైండోవర్ ప్రక్రియలో భాగంగా నిర్ణీత కాలంలో తగిన ష్యూరిటీలు అందించనందున వారిని ఆరునెలల జైలు శిక్షలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు.

ఒకరికి ఐదేళ్లు..

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణానికి మేసినేని కార్తిక్‌కు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి నిర్మల ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు చెప్పినట్లు ఎస్సై రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఊరు మందమర్రికి చెందిన కార్తిక్ చిన్నతనంలోనే తలిదండ్రులను కోల్పోయి చెడు అలవాట్లకు బానిసయ్యాడు. ఈక్రమంలో కార్తిక్ తన చిన్నమ్మ మేసినేని భీమక్కను మద్యం కోసం డబ్బులు అడగగా ఆమె నిరాకరించింది. దీంతో ఆమె తలపై బండరాయితో దాడి చేశాడు. భీమక్క కుమారుడు సంజీవ్ తన తల్లిపై జరిగిన దాడి విషయంపై కార్తిక్‌ను మందలించాడు. తనను సంజీవ్ మందలించాడనే విషయాన్ని మనసులో పెట్టుకుని 23 ఫిబ్రవరి 2020న సంజీవ్ ఇంట్లో ఉన్నప్పుడు గొడ్డలితో తలపై దాడి చేశాడు. దీంతో సంజీవ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై శివకుమార్ కేసు నమోదు చేయగా తర్వాత ఎస్సై భూమేశ్ దర్యాప్తు చేపట్టారు. కేసు ట్రయల్ సమయంలో కోర్టు కానిస్టేబుల్ సురేందర్ ముఖ్య సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంది రవీందర్ విచారణలో కీలకపాత్ర పోషించారు. నిందితునికి విచారణ అనంతరం ఐదేళ్ల శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించిందని ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా నిందితునికి శిక్ష పడేలా చేసిన ఎస్సై, కానిస్టేబుల్, పీపీ తదితరులను డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి అభినందించారు.

వ్యాపారిని బెదిరించిన వ్యక్తిపై కేసు

ఇంద్రవెల్లి: ఎడ్లు తరలిస్తున్న వ్యాపారిని ఆపి డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలంలోని చించోలి గ్రామానికి చెందిన ఎండీ సాదిక్ అనే వ్యాపారి మంగళవారం రాత్రి ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామానికి వెళ్లి రెండు ఎడ్లను కొనుగోలు చేసి ఆటోలో ఇచ్చోడకు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో ఇంద్రవెల్లి మార్కెట్ వద్ద తగ్రే ఇందల్‌తోపాటు మరికొందరు ఆటో ఆపి ఎడ్లకు సంబంధించిన పత్రాలు చూపించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో డబ్బులు డిమాండ్ చేసి ఘర్షణకు దిగారు. దీనిపై ఎండీ సాదిక్ ఫిర్యాదు మేరకు తగ్రే ఇందల్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు కేసు నమోదు చేశారు. అతడిని ఉట్నూర్ కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కన్నీళ్లు పెట్టుకున్న హైకోర్టు జడ్జి

- సహాయకుడి అంత్యక్రియలకు హాజరైన శ్రీదేవి దంపతులు


భౌతికకాయం వద్ద కన్నీరు పెట్టుకుంటున్న శ్రీదేవి-శ్రీహరిరావు దంపతులు

మామడ: మండలంలోని నల్దుర్తి గ్రామానికి చెందిన ఉదయ్ అనే యువకుడు మంగళవారం కనకాపూర్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం నల్దుర్తి గ్రామంలో అతడి అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని తమ నివాసంలో సహాయకుడిగా పనిచేసే ఉదయ్ అంత్యక్రియలకు హైకోర్టు జడ్జి జువ్వాడి శ్రీదేవి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు దంపతులు హాజరయ్యారు. తమ కుటుంబంలో ఒకరిగా మెదిలిన ఉదయ్ భౌతికకాయం చూడగానే భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. అతని కుటుంబ సభ్యులను ఓదార్చారు. తల్లిదండ్రులు లేని ఉదయ్ కొన్నేళ్లుగా తమ ఇంట్లో కుటుంబ సభ్యుడిగా ఉంటున్నాడని, రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. అంత్యక్రియల్లో గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తున్న ఇద్దరిపై కేసు


గంజాయి మొక్కలతో ఎస్సై మహేందర్

వాంకిడి: పత్తి చేనులో గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆర్లీ గ్రామ శివారులోగల పత్తి చేనులో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో కలిసి బుధవారం తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పెరకవాడకు చెందిన ఆకిరెడ్డి పోచయ్య అనే వ్యక్తి చేనులో ఎనిమిది గంజాయి మొక్కలు, ఆర్లి గ్రామానికి చెందిన కావుడె బాజీరావు చేనులో 11 గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. మొక్కలను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రూ.50 లక్షల విలువైన గంజాయి మొక్కలు స్వాధీనం!

గుడిహత్నూర్: మండలంలోని తోయగూడ శివారు ప్రాంతంలోని వ్యవసాయ చేనులో సుమారు రూ.50లక్షల విలువైన గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు గ్రామస్తుల ద్వారా సమాచారం అందింది. మండలంలోని తోషం గ్రామానికి చెందిన బాపురావ్ చేనులో రెండు చోట్ల సుమారు 500 గంజాయి మొక్కలు సాగు చేసినట్లు సీసీఎస్ పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా.. తాము విచారణ చేపడుతున్నామని, పూర్తి సమాచారం అందిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. కాగా, ఇంత పెద్ద మొత్తంలో గంజాయి సాగు బహిర్గతం కావడం మండలంలో చర్చనీయాంశమైంది.

ఎస్బీఐ కేసును ఛేదించిన పోలీసులు?

- ఒక్కరోజే 2కిలోల నగలు రికవరీ


చెన్నూర్‌లో నగలు రికవరీ చేస్తున్న సీఐ

చెన్నూర్: చెన్నూర్ ఎస్బీఐ బ్రాంచ్‌లో గత నెల 23న అపహరణకు గురైన 20కిలోల బంగారు ఆభరణాలను పోలీసులు పూర్తిస్థాయిలో రికవరీ చేసినట్లు సమాచారం. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు 10రోజుల వ్యవధిలోనే ప్రధాన నిందితునితోపాటు ఈ ఘటనలో భాగస్వామ్యమున్న మరో 46 మందిపై కేసు నమోదు చేశారు. 43మందిని రిమాండ్‌కు పంపించారు. గత నెల 31న 15.237 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ చేసినట్లు రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా వెల్లడించిన విషయం తెలిసిందే. చెన్నూర్ ఎస్బీఐ కేసులో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు నేతృత్వంలో చెన్నూర్ సీఐ దేవేందర్‌రావు ఆధ్వర్యంలో రోజురోజుకూ పురోగతి సాధించారు. ఈ నెల 31నుంచి బంగారు నగల రికవరీని ప్రారంభించారు. వివిధ ఫైనాన్స్ కంపెనీలు, గోల్డ్‌లోన్ కంపెనీలు, ఫైనాన్స్ సంస్థల నుంచి 18కిలోల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వీటిని గత మంగళవారం తెల్లవారుజామున చెన్నూర్ ఎస్బీఐ బ్రాంచ్‌లోని సేఫ్టీ లాకర్‌లో భద్రపరిచారు. ఈ కేసులో పోలీసులు దూకుడుగా వ్యవహరించి గోల్డ్‌లోన్ బాధితులకు అడుగడుగునా భరోసానిస్తున్నారు. ఏక కాలంలో మంచిర్యాల మణప్పురం, ముత్తూట్ ఫిన్ క్రాప్‌ల నుంచి మరో రెండు కిలోల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఎట్టకేలకు పోలీసులు పూర్తిస్థాయిలో బంగారు నగలు రికవరీ చేసినట్లు తెలిసింది.

నేడు వివరాలు వెల్లడించనున్న పోలీసులు!

బంగారు ఆభరణాల రికవరీ విషయాన్ని గురువారం పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించనున్నట్లు సమాచారం. 20రోజులుగా ఆందోళనకు గురవుతున్నా గోల్డ్‌లోన్ బాధితులకు పూర్తి భరోసా ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. వివిధ ఫైనాన్స్ కంపెనీల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను త్వరగా కోర్టుకు అప్పగించి బ్యాంక్ ద్వారా బాధితులకు ఇచ్చేలా చర్యలు వేగవంతం చేసినట్లు సమాచారం. ఏదేమైనా రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన ఎస్బీఐ బ్రాంచ్ నుంచి బంగారు ఆభరణాల అపహరణ కేసును రామగుండం సీపీ ఆధ్వర్యంలో మంచిర్యాల డివిజన్ పోలీసులు అనతికాలంలో ఛేదించడం విశేషం.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

- ఆరుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అర్జున్, సంతోష్

ఇంద్రవెల్లి: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మండలంలోని దనోరా (బీ) గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, 108 పైలట్ రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్‌కు చెందిన సంతోష్ తన స్నేహితుడు బాలాజీతో కలిసి ద్విచక్ర వాహనంపై దనోరా నుంచి గుడిహత్నూర్ వైపు వెళ్లడానికి ప్రధాన రహదారి ఎక్కుతున్నాడు. ఇదే క్రమంలో ఎదురుగా గుడిహత్నూర్ నుంచి ఉట్నూర్ వైపు కుటుంబ సభ్యులతో వస్తున్న ఉట్నూర్ మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన టిత్రే అర్జున్ ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మన్నూర్‌కు చెందిన సంతోష్‌కు ఎడమ చేయికి తీవ్ర గాయాలు కాగా, తోడుగా ఉన్న బాలాజీకి స్వల్ప గాయాలయ్యాయి. ఉట్నూర్ మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన అర్జున్‌కు తలకు తీవ్ర గాయాలు కాగా, అతడి భార్య శారదకు కుడి చేతికి గాయాలయ్యాయి. పెద్ద కొడుకు కార్తిక్‌కు ముక్కు, తలకు, చిన్న కొడుకు రితిక్‌కు ఎడమ కాలుకు తీవ్ర గాయాలైనట్లు వారు తెలిపారు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో వారిని ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ఇన్సాస్ రైఫిల్ తస్కరించిన నేవీ కానిస్టేబుల్

- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అర్ధరాత్రి ముంబయి క్రైం బ్రాంచ్ సోదాలు
- ఆయుధంతోపాటు 40తూటాలు, 3 మ్యాగ్జిన్లు స్వాధీనం


పోలీసుల అదుపులో రాకేశ్, ఉమేశ్

పెంచికల్‌పేట్(సిర్పూర్): ముంబయిలో ఓ నేవీ కానిస్టేబుల్ తస్కరించిన ఇన్సాస్ రైఫిల్‌ను కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆ నగర క్రైం బ్రాంచ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపిన వివరాల ప్రకారం.. పెంచికల్‌పేట్ మండలం ఎల్కపల్లి గ్రామానికి చెందిన దుబ్బుల రాకేశ్ రెండేళ్ల క్రితం నేవీలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి ఫిబ్రవరి వరకు ముంబయిలో విధులు నిర్వర్తించాడు. ఇటీవల కేరళలోని ఎర్నాకుళంకు బదిలీపై వెళ్లాడు. కాగా, ఈ నెల 6న రాకేశ్ తన అన్న దుబ్బుల ఉమేశ్‌తో కలిసి ముంబయి నేవీ కేంద్రానికి వెళ్లాడు. సెంట్రీ స్థలం నుంచి ఇన్సాస్ రైఫిల్‌తోపాటు, 40 తూటాలు, మూడు మ్యాగ్జిన్లను వారు దొంగిలించారు. ఆయుధంతో ఇద్దరు సోదరులు స్వగ్రామం ఎల్కపల్లికి చేరుకున్నారు. నేవీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన క్రైం బ్రాంచ్ పోలీసులు, స్థానిక పోలీసు అధికారుల సహకారంతో నిందితులను మంగళవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఆయుధం, తూటాలు, మ్యాగ్జిన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో ముంబయి క్రైం బ్రాంచ్‌కు సహకరించిన కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి, పెంచికల్‌పేట్ ఎస్సై అనిల్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు. దేశ భద్రత కోసం విధులు నిర్వర్తిస్తున్న యువకుడు పక్కా ప్రణాళిక ప్రకారం ఆయుధాన్ని దొంగిలించి, సొంత గ్రామానికి తీసుకురావడంలో కుట్ర కోణం దాగి ఉన్నట్లు తెలుస్తోంది. అధికారుల పూర్తి విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.